క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన


కొర్లాం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెరకముడిదాం: మండలంలోని కొర్లాం, భగీరధపురం గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేసేందుకు జేఈ కె.చంద్రశేఖర్, మండల సర్వేయరు ఖాదర్, వీఆర్వోలు కలిసి సోమవారం స్థలాలను పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో సెల్‌ఫోన్‌లకు సిగ్నల్ సరిగా రాక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ విషయాన్ని బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు స్పందించి టవర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ రెండు గ్రామాలతో పాటూ పరిసర గ్రామాలకు చెందిన వినియోగదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఓ వాటర్ ప్లాంటు ప్రారంభం


ఆర్ఓ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దాతల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంటును తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సోమ వారం ప్రారంభించారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు, ప్రజల కోసం వంద లీటర్ల సామర్థ్యం గల ఆర్ఓ వాటర్ ప్లాంటును అంటుబాటులోకి తెచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.డీటీ రాజేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


బాధితులకు సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: మార్లాపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం లో అయిదు ఇళ్లు దగ్ధ మయ్యాయి. బాధిత కుటుంబాలకు కొత్తవలస మండలంలోని కంటకాపల్లి గ్రామ సమీపంలో ఉన్న శారద మెటల్స్ అండ్ ఎల్లోయిస్ కర్మాగారం సోమవారం తమ వంతు సహాయం అందిం చింది. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు, 25 కిలోల బియ్యం, దుప్పట్లు, తువ్వాళ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. సర్పంచ్ గోగాడ సత్యం, ఏఎంసీ చైర్మన్ మల్లు నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గేదెను కాపాడిన ఫైర్ సిబ్బంది


మురుగు గుంత నుంచి గేదెను బయటకు తీసున్న ఫైర్ సిబ్బంది

శృంగవరపుకోట: పట్టణంలోని మురుగునీటి గుంతలో పడి ప్రాణాపాయస్థితిలో ఉన్న గేదెను స్థానిక ఫైర్ సిబ్బంది సోమవారం రక్షించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ఉన్న మురుగు గుంత వైపునకు మేతకు వెళ్లిన ఓ గేదె గుంతలో పడిపోయింది. గుంత నుంచి బయటకు రాలేక గేదె ప్రాణాపాయస్థితిలో ఉండడంతో రైతులు స్థానిక అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చి రైతులతో కలిసి గేదెను కాపాడారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం


విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామ జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి-26పై వేగంగా వెళుతున్న ఓ లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటన సోమ వారం చోటు చేసుకుంది. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టి నిలిచి పోయింది.అదే ప్రాంతంలో వివిధ వ్యాపారాలు నిర్వహించే షాపులు ఉన్నాయి.లారీ షాపుల వైపు దూసుకు వెళితే ప్రాణ నష్టం సంభవించేది. అయితే లారీ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



బొండపల్లి: బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చిన దేవుపల్లిలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారు


శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలో ఏర్పాటు చేసిన మంటపంలో కొలువుదీరిన దుర్గమ్మ


లక్కవరపుకోట: కోనమిసివానిపాలెంలో ఏర్పాటు చేసిన మంటపంలో కొలువుదీరిన అమ్మవారు


శృంగవరపుకోట: ఎస్.కోట దేవీచౌక్‌లోని దుర్గాదేవి ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు


జామి :అలమండలోని దుర్గాదేవి ఆలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారి దర్శనం


మెరకముడిదాం: దుర్గాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా నెలకొల్పిన దుర్గమ్మ మండపాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన శరన్నవరాత్రుల్లో దుర్గాదేవిని బాలాత్రిపురసుందరిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దుర్గమ్మతల్లిని పూజించారు. - సాక్షి నెట్‌వర్క్


చీపురుపల్లి రూరల్(గరివిడి): గర్భాం రోడ్డు జంక్షన్‌లో నెలకొల్పిన నవదుర్గాదేవిలు


శృంగవరపుకోట: ఎస్.కోటలోని మోక్ష విద్య యోగమందిర్‌లో పూజలు చేస్తున్న మహిళలు


గజపతినగరం: గజపతినగంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు మంటపానికి తరలిస్తున్న భక్తులు


బొండపల్లి: అంబటివలసలోని సంతోషిమాత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవార్ల విగ్రహాలు


వేపాడ: వల్లంపూడిలో పూజలు చేస్తున్న భక్తులు


లక్కవరపుకోట: ఎల్.కోటలో ఏర్పాటు చేసిన మంటపంలో పూజలందుకుంటున్న అమ్మవారు


గుర్ల: కెల్లలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


కొత్తవలస: కొత్తవలసలోని విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన మంటపంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి: ఒంపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జె.జనార్దన రా వు సోమ వారం తెలిపారు. ఒంపల్లిలో బి.చిన్నప్పన్న అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేసి, అరెస్టు చేశామని సీఐ చెప్పారు.బెల్టు షాపుల నిర్వహించినా, వేలంపాటలు వేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్,హెచ్‌సీ బాషా,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడి శ్రీరాములు

లక్కవరపుకోట:

మండలంలోని చందులూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ డాక్టర్ పి.శ్రీరాములు సోమవారం తెలిపారు. బాలికల విభాగంలో విద్యార్థినులు కె.లావణ్య ,ఎర్ని రుచిత, బాలుర విభాగంలో సీహెచ్.దేవేంద్ర ఎంపికయ్యారని, వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.మంగళ వారం నుంచి గురువారం వరకు మూడు రోజులు పాటు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు సోమవారం పయనమయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం ఎస్.శివరామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు


ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనా పట్టించుకోరా...?

ఈ నెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో వెలువడిన కథనం

సాక్షి ఎఫెక్ట్...

మెరకముడిదాం: మండలంలోని గొల్లలవలస గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురవడంతో గ్రామానికి తాగునీరు కరువైంది, అలాగే వరి పంటకు అవసరమైన సాగునీరు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఈ నెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనా పట్టించుకోరా..? అనే శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ దివాకర్ తన సిబ్బందితో కలిసి సోమవారం మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గొల్లలవలస గ్రామస్తులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


గొల్లలవలసలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

డైలీ మార్కెట్‌లో పూడికల తొలగింపు

చీపురుపల్లి: పట్టణంలోని డైలీ మార్కెట్‌లో గల కాలువల్లో పూడికలు మేజర్ పంచాయతీ సిబ్బంది తొలగించారు. డైలీ మార్కెట్‌లో గల వీధి కాలువలు పూడికలతో నిండిపోవడంతో మురుగు నీరు ప్రవహించడం లేదని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్డెక్కి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి దృష్టికి అక్కడి నివాసితులు తీసుకొచ్చారు. దీంతో తక్షణమే స్పందించిన ఆమె డైలీ మార్కెట్‌లో కాలువల్లో పూడికలు తొలగించాలని మేజర్ పంచాయతీ అధికారులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడికలు తొలగించే పనులను చేపట్టారు. ఈ పనులను మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ దగ్గరుండి పర్యవేక్షించారు.


డెలీ మార్కెట్‌లో కాలువల పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గజపతినగరం: పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక, ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి


జామి: కలగాడలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి

గజపతినగరం: పోషక విలువలు గల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా తుమికాపల్లి గ్రామ సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్స్‌ను ఎంపీపీ తిలకించారు. ఐసీడీఎస్ పీఓ ఎం.రాజేశ్వరి, సర్పంచ్ బెల్లాన త్రినాథ రావు, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి, తదితరులు పాల్గొన్నారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

జామి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కలగాడ సచివాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమ వారం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేసి, అవగాహన కల్పించారు. అలమండ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గుర్ల: విద్యార్థులు, యువత చదువుకునేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయంలో వసతులు కల్పిస్తున్నట్టు ఎంపీపీ పొట్నూరు ప్రమీల తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం చుట్టూ ఎంపీపీ నిధులు రూ.2లక్షలతో నిర్మించిన ప్రహరీని జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి. సూర్యనారాయణ రాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడుతో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, కిలారి సూర్యనారాయణ, మంత్రి వెంకటరమణ, లైబ్రేరియన్ రామారావు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, ప్రజాప్రతినిధులు

జీఎస్టీ ఉపసంహరణ ఏఐఈఈఏ విజయం


మాట్లాడుతున్న ఏఐఈఈఏ సభ్యులు

శృంగవరపుకోట: బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణ ఏఐఈఈఏ సాధించిన గొప్ప విజయమని ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు అభిప్రాయపడుతూ హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సోమవారం మాట్లాడుతూ ఆరోగ్య జీవిత బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. బీమా ప్రీమియంలపై 18శాతం జీఎస్టీని కేంద్రం ఉపసహరించుకుందని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ఎస్.కోట బేస్ యూనిట్ కార్యదర్శి జి.రాకేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ముద్దూరులో వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: వైద్య, ఆరోగ్య శాఖ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు సూచించారు.బొండపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ముద్దూరులో సోమవారం సాధారణ, ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. బొండపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, గొట్లాం ఆయుర్వేద ఆస్పత్రి డాక్టర్ బి.సునీత శిబిరంలో మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఏ. బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


తలారిలో అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

శృంగవరపుకోట: మహిళలు, కిశోరబాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ లావణ్య సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్టాం పీహెచ్‌సీ పరిధిలోని ఎస్.కోట తలారి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ లావణ్య, వైద్యసిబ్బంది శిబిరంలో 160మంది మహిళలకు 14 రకాల వైద్య పరీక్షలు చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సర్పంచ్ రంది అరుంధతి, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాలు బాగు చేసుకోవాలి

- గుర్ల ఎంపీపీ ప్రమీల


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

చీపురుపల్లి: పంచాయతీల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాలు బాగు చేసుకోవాలని గుర్ల ఎంపీపీ పొట్నూరు ప్రమీల చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చీపురుపల్లి, గుర్ల మండలాల ఎంపీపీలు, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండు రోజులు జరగనున్న శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సర్పంచ్‌లు పురుషులు, మహిళలతో సంబంధం లేకుండా అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా మహిళా సర్పంచ్‌లు సంతకాలకే పరిమితమవ్వకుండా పంచాయతీ నిధులు, విధులపై విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. పంచాయతీలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పని తీరు తెలుసుకుని లోపాలు ఉంటే సవరించాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. సర్పంచ్‌లకు రెండు రోజులు ఇక్కడ నిర్వహించే శిక్షణలో విషయాలను పూర్తిగా అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఐ.సురేష్ మండల పరిషత్ ఏవో ప్రవీణ్, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న సుమల శ్రీనివాసరావు


మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసరావు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మండలంలోని కె.కృష్ణాపురం గ్రామానికి చెందిన సుమల శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, గజపతిన గరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన శ్రీనివాసరావు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుతో పాటు మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యను విజయనగరంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బమ్మిడి అప్పలనాయుడు, నాయకులు సుమల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై నిరసన


నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు.

చీపురుపల్లి రూరల్(గరివిడి): కార్మికుల పని గంటల పెంపుదలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలో గల డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంబళ్ల గౌరినాయుడు మాట్లాడుతూ కార్మికుల పని గంటలు ఇది వరకు రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే ఉండేదని, ఇప్పుడు ఆ పని గంటలను ఎనిమిది నుంచి పది గంటలకు పెంచుతూ అసెంబ్లీలో ఆమోదం చేశారని అన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్నామన్నారు. కార్మికుల శ్రమ దోపిడికి గురవుతుందని, కార్మికులకు తగిన ప్రతిఫలం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.విశ్వనాథరాజు, కంది రామారావు, ఎస్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.